క్లుప్తంగా

రేపటి నుంచి పేదలకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్

విజయవాడరూరల్: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులకు శనివారం నుంచి గ్రామ సచివాలయాల్లో స్థలాలను రిజిస్ట్రేషన్ చేస్తామని విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ కె.లక్ష్మి తెలిపారు. నున్న గ్రామంలోని పాతపాడు, పి.నైనవరం, కొత్తూరు జక్కంపూడి గ్రామాల్లోని గ్రామ సచివాలయాల్లో లబ్ధిదారులకు ఉచితంగా రిజిస్ట్రేషన్(కన్వేయన్స్)చేసి వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. ఆయా సచివాలయాల్లోని సెక్రటరీలు సబ్ రిజిస్ట్రార్లుగా, వీఆర్వోలు ఎగ్జిక్యూటివ్‌లుగా వ్యవహరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తహసీల్దార్ చెప్పారు. విజయవాడ రూరల్ మండలంలో రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద మొత్తం 10,660 మందికి ఇళ్ల స్థలాలను పంపిణీ చేసిందన్నారు.

దుట్టాతో షర్మిల భేటీ



హనుమాన్‌జంక్షన్‌రూరల్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ సన్నిహితుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ దుట్టా రామచంద్రరావుతో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల గురువారం రాత్రి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. జంక్షన్‌లోని దుట్టా నివాసానికి వచ్చిన ఆమె దుట్టా కుటుంబ సభ్యులతో ముచ్చటించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ కుటుంబంతో తమకు 40 ఏళ్లగా సాన్నిహిత్యం ఉందని, వైఎస్సార్ బిడ్డగా తనను కలవటానికి షర్మిల వచ్చారని దుట్టా తెలిపారు. తమ భేటీకి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదన్నారు. షర్మిల వెంట సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, పీసీసీ మాజీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, కేంద్ర మాజీ మంత్రి ఎం.ఎం.పళ్లంరాజు ఉన్నారు.

కారు ఢీ కొనడంతో సెక్యూరిటీ గార్డుకు గాయాలు

పెనమలూరు: గోసాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డుకు గాయాలు కావడంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామవరప్పాడు హనుమాన్‌నగర్‌కు చెందిన కూనపరెడ్డి నాగనాంచారయ్య ఆటోనగర్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తుంటాడు. అతను బైక్‌పై కంకిపాడు నుంచి కానూరు వైపునకు వస్తుండగా గోసాల సెంటర్ వద్ద వెనుక నుంచి వచ్చిన కారు అతని బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో నాగనాంచారయ్య కాలికి తీవ్ర గాయమైంది. అతడిని చికిత్సకై విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

పెనమలూరు: మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప చిన్నవంతెన వద్ద పోలీసులు తనిఖీ చేయగా కార్మికనగర్‌కు చెందిన సింగంశెట్టి వేణు మద్యం అక్రమంగా విక్రయిస్తూ పట్టుబడ్డాడు. అతని వద్ద రూ వద్ద 7 మద్యం సీసాలు రూ.990 సొమ్ము స్వాధీనం చేసుకున్నారు. అలాగే యనమలకుదురు అంబేద్కర్ బొమ్మ వద్ద పోలీసులు తనిఖీ చేయగా గ్రామానికి చెందిన సరిహద్దు రాజేష్ మద్యం అక్రమంగా అమ్ముతూ పట్టుబడ్డాడు. అతని వద్ద 7 మద్యం సీసాలు, రూ.910 సొమ్ము స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

టోల్ ప్లాజా వద్ద తనిఖీల్లో రూ.4.10 లక్షల స్వాధీనం

ఉంగుటూరు: ఎటువంటి ఆధారాలు లేని రూ.4.10 లక్షల నగదును తీసుకువెళ్తున్న నలుగురు వ్యక్తులను ఆత్కూరు పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. గన్నవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య నేతృత్వంలో హనుమాన్ జంక్షన్ సీఐ ఎ.వీవీ నరసింహమూర్తి ఆదేశాల మేరకు ఎస్ఐ సూర్యశ్రీనివాస్ తన సిబ్బందితో పొట్టిపాడు టోల్ ప్లాజా వద్ద వాహన తనిఖీ నిర్వహించారు. తనిఖీలో పిడుగురాళ్ల నుంచి రావులపాలెం వెళ్తున్న కారులో రూ.4,10,000 నగదును గుర్తించారు. సరైన పత్రాలు చూపకపోవడంతో స్టేషన్‌కు తరలించి నగదును స్వాధీనపరచుకుని సీజ్ చేశారు.

సైన్స్ ల్యాబ్‌కు ఉపకరణాల అందజేత

హనుమాన్‌జంక్షన్‌రూరల్: శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి సాధించినప్పుడే దేశం ప్రగతిపథంలో ముందుకు సాగుతుందని విశ్రాంత డివిజనల్ పంచాయతీ అధికారి శివలెంక శ్రీనగేష్ అన్నారు. స్థానిక నూజివీడురోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియెట్ ప్రయోగశాలకు అవసరమైన రూ.20 వేలు విలువ చేసే పరికరాలను గురువారం ఆయన అందజేశారు. విద్యార్థుల్లో సైన్స్ పట్ల అభిరుచి, ఆసక్తి కలిగించే విధంగా పాఠ్యాంశాల బోధన సాగాలని శ్రీనగేష్ తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు, సైన్స్ ఉపాధ్యాయులు చలపతిరావు, ప్రమీలరాణి, రవికుమార్, నాగ మల్లేశ్వరరావు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభంజనం ఖాయం

- ఎందరు కలిసొచ్చినా జగనన్న గెలుపును అడ్డుకోలేరు
- రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్
- ఉత్సాహంగా పెనమలూరు నియోజకవర్గ స్థాయి వైఎస్సార్ సీపీ విస్తృత సమావేశం



పెనమలూరులో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి జోగి రమేష్, వేదికపై పార్టీ ముఖ్య నేతలు

కంకిపాడు: రాష్ట్రంలో యుద్ధం మొదలైంది. ఎందరు కలిసొచ్చినా, కుట్రలు పన్నినా జగనన్న గెలుపును అడ్డుకోవటం తరం కాదు. నీచరాజకీయాలు చేసే అనైతిక శక్తులను కృష్ణానదిలో కలిపేయటం ఖాయమని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్ అన్నారు. వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం కంకిపాడులోని ఆయానా ఫంక్షన్ హాలులో గురువారం రాత్రి నిర్వహించారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. పెనమలూరు గడ్డ వైఎస్సార్‌సీపీ అడ్డా అన్నారు. ఈ నియోజకవర్గంలో ఎవరిని గెలిపించినా అది జగనన్నను చూసే అన్నారు. ఇక్కడి నుంచి చంద్రబాబు పోటీ చేస్తున్నారనే ప్రచారంతో ఢీ కొట్టాలనే భావనతో జగనన్న తనకు పెనమలూరు సీటు కేటాయించారన్నారు. ఎవరొచ్చినా ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికీ తాను విలువ ఇస్తానని, ఏ సమస్య ఉన్నా నేరుగా తనకు చెబితే పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు.

జగనన్న పీఠంపై కన్ను..

జగనన్న పీఠంపై కొన్ని దుష్టశక్తులు కన్నేశాయని మంత్రి జోగి రమేష్ దుయ్యబట్టారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండి చంద్రబాబు చేసిందేమీ లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ప్రతి ఇంటా సంతోషం, ఆనందం కోసం సీఎం జగన్ తపిస్తున్నారన్నారు. ప్రజల గుండెల్లో జగనన్న స్థానం పదిలంగా ఉందన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా, కుయుక్తులు పన్నినా 175 స్థానాల్లోనూ వైఎస్సార్ సీపీ విజయం సాధించటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పెనమలూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని అధిక మెజారిటీతో గెలిపించి జగనన్నకు కానుకగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. నియోజకవర్గ సంక్షేమం కోసం జగనన్న సైనికుడిగా పని చేస్తానని, ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటానని స్పష్టంచేశారు. రీజనల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు 85 శాతం ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. పెనమలూరు ఎమ్మెల్యే, మచిలీపట్నం ఎంపీ స్థానాలను గెలిపించటం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. తొలుత మహానేత వైఎస్సార్ విగ్రహానికి రీజనల్ కో ఆర్డినేటర్ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. విజయవాడ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్, కేడీసీసీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, జెడ్పీటీసీ బాకీ బాబు, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, పార్టీ నేతలు దేవభక్తుని సుబ్బారావు, అన్నే చిట్టిబాబు, అన్నే శ్రావణ్, టీకేఆర్, జేసీఎస్ చైర్మన్ రామారి చిరంజీవి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు రామినేని రమాదేవి, నందిపాటి బిందుమాధవి, ఈడే చాముండేశ్వరి, పి.రాఘవరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, మూడు మండలాలకు చెందిన పార్టీ మండల బాధ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ప్రజలు

డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించాలని వినతి



గన్నవరం: డంపింగ్ యార్డుకు అవసరమైన స్థలాన్ని కేటాయించాలని రెవెన్యూ అధికారులకు గన్నవరం గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ సీహెచ్ నరసింహారావుకు గ్రామ సర్పంచ్ నిడమర్తి సౌజన్య, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 30 వేలు జనాభా కలిగిన గన్నవరం గ్రామ పంచాయతీకి శాశ్వత డంపింగ్ యార్డు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. గతంలో రెవెన్యూ శాఖ గొల్లనపల్లి శివారు ఆర్ఎస్ నంబర్ 88లో రెండు ఎకరాలు చెత్త డంపింగ్ చేసుకునేందుకు అనుమతించారని చెప్పారు. పరిసరా ప్రాంత రైతులు అభ్యంతరం మేరకు అక్కడ చెత్త డంపింగ్ నిలిచిపోయిందన్నారు. డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారం చూపాలని వారు కోరారు. వీరి విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన తహసీల్దార్ స్థల కేటాయింపునకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

హోరాహోరీగా ఆడుదాం ఆంధ్రా పోటీలు

గన్నవరం: నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. క్రీడా సంబరాల్లో భాగంగా స్థానిక కేవీఆర్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలుత ఈ పోటీలను ఆడుదాం ఆంధ్రా ప్రత్యేకాధికారి మహ్మద్ హాజీ బేగ్ ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం పురుషులు, మహిళల విభాగాల్లో పోటీలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన మహిళల ఫైనల్ మ్యాచ్‌లో విజయవాడ రూరల్ జట్టుపై గన్నవరం జట్టు ఘన విజయం సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది. అనంతరం స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాలలో జరిగిన మహిళల ఖోఖో ఫైనల్ మ్యాచ్‌లో ఉంగుటూరు జట్టుపై బాపులపాడు జట్టు విజయం సాధించి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించింది. పురుషుల కబడ్డీ ఫైనల్ మ్యాచ్‌లో విజయవాడ రూరల్ జట్టుపై గన్నవరం జట్టు గెలుపొంది జిల్లా స్థాయి పోటీలకు వెళ్లింది. ఎంపీడీఓ ఈ.సత్యకుమార్, ఈఓపీఆర్డీ పి.వెంకటేశ్వరమ్మ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరివీధి వెంకయ్య, ఈఓలు బాపూజీ, అనిల్‌కుమార్, కేవీఆర్ స్పోర్ట్స్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బ్యాడ్మింటన్ క్రీడాకారులతో అధికారులు

పెనమలూరులో పోటీలు

పెనమలూరు: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు గురువారం ఉత్సాహంగా జరిగాయి. క్రీడాకారులు పోటీల్లో సత్తా చాటారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్‌లో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న జట్లలో పురుషుల విభాగంలో కంకిపాడు జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఉయ్యూరు, పెనమలూరు జట్లు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. మహిళల్లో ప్రథమ స్థానం కంకిపాడు, రెండో స్థానం ఉయ్యూరు నిలిచాయి. ఖోఖో పోటీల్లో పురుషుల విభాగంలో ప్రథమ స్థానం ఉయ్యూరు, పెనమలూరు, వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ జట్లు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. మహిళల్లో ప్రథమ స్థానం ఉయ్యూరు, కంకిపాడు, వైఎస్సార్ తాడిగడప రెండు, మూడు స్థానాలు గెలుచుకున్నాయి. గెలుపొందిన జట్లు త్వరలో జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటాయి. కార్యక్రమంలో ఉయ్యూరు ఎంపీడీఓ విమాదేవి, కంకిపాడు ఎంపీడీఓ అనూష, మున్సిపాలిటీ మేనేజర్ ఎస్.విజయలక్ష్మి, ఏఓ లోయ శివశంకర్‌రావు, ఈఓపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.



వాలీబాల్ విజేత కంకిపాడు జట్టు

ఎయిర్‌పోర్ట్‌లో గణతంత్ర వెలుగులు



గణతంత్ర వేడుకలకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం) ముస్తాబైంది. ఎయిర్‌పోర్ట్‌లోని డొమెస్టిక్ టెర్మినల్‌ను త్రివర్ణ పతాక రంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. టెర్మినల్ ఆవరణలోని గార్డెన్‌ను కూడా ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాల వెలుగుల్లో టెర్మినల్ భవనం ప్రయాణికులను ఆకట్టుకుంటుంది. – గన్నవరం

450 మందికి వైద్య పరీక్షలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు ఎస్‌ఈఆర్ సెంటర్‌లో గురువారం ఫస్ట్ మెస్సీయ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కామినేని హాస్పిటల్స్‌తో పాటు పలువురు వైద్యులు పాల్గొని వైద్య సేవలందించారు. తొలుత శిబిరాన్ని ఫస్ట్ మెస్సీయ ఫెలోషిప్ కార్య నిర్వాహకులు సజ్జా ప్రసాదరావు ప్రార్థన చేసి ప్రారంభించారు. ఈ శిబిరంలో గుండె, ఊపిరితిత్తులు, దంత, కీళ్ల వ్యాధులు, గైనకాలజీ, నేత్ర పరీక్ష, సాధారణ వ్యాధులకు సుమారు 450 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, సుగరు, అవసరమైన వారికి ఈసీజీ పరీక్షలను నిర్వహించారు. వైద్య శిబిరంలో మెస్సీయ ఫెలోషిప్ వ్యవస్థాపక అధ్యక్షుడు సజ్జా ఎలియాజరు, కన్వీనర్ కోడూరు శ్రీనివాసరావు, వైద్యులు ప్రమోద్, మాధురిక, ప్రభుకుమార్, జమీలా అహ్మద్, కిరణ్‌కుమార్, లీలా కృష్ణ మోహన్, నాగ వజ్రకుమార్, దివ్య, జాషువా, వానస్ ఐకేర్ వైద్య ప్రతినిధులు పాల్గొన్నారు.



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఆకట్టుకున్న ఫేషియల్ పెయింట్స్

గుణదల(విజయవాడతూర్పు): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రా లయోల కాలేజీలో గురువారం నిర్వహించిన సోషల్ హార్మోని (ఫేషియల్ పెయింట్) ఆకట్టుకుంది. బీఎస్సీ విజువల్ కమ్యూనికేషన్స్, ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సోషల్ యూనిటీ ఆఫ్ కలర్స్, మత సామరస్యం, చిన్నారి బాధ, వార్ అండ్ హ్యుమానిటీ, 75వ గణతంత్ర దినోత్సవ జాతీయ జెండా, మూడు మతాల సూచిక, మహాత్మాగాంధీ గొప్పదనం, శాంతి-సౌభ్రాతృత్వం-సమానత్వం, యోగా (ఆరోగ్యమే మహా భాగ్యం), పాజిటివిటీ, ద జాయ్ ఆఫ్ ఇండిపెండెన్స్ (డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా గాంధీ), మతాల ఏకమత్యం, శాంతికపోతం తదితర పెయింట్స్‌ను ముఖానికి వేసుకుని ప్రదర్శన ఇచ్చారు. విజువల్ కమ్యూనికేషన్స్ విభాగాధిపతి ఫాదర్ రాయప్ప, వైస్ ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, స్టూడెంట్స్ యాక్టివిటీ డీన్ శుభ, అధ్యాపకులు శ్రీధర్, జి.కార్తీక్, పి.లలిత విద్యార్థులను అభినందించారు.

ఆలయంలో పౌర్ణమి పూజలు

గన్నవరం: స్థానిక యాదవుల రామాలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా లలితా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో పూజలు చేశారు. అర్చకుడు శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



ఓటుతోనే ప్రజాస్వామ్యం పరిరక్షణ

- ఘనంగా ఓటర్ల దినోత్సవం
- సీనియర్ ఓటర్లకు సన్మానం
- కొత్త ఓటరు కార్డుల జారీ



ఉత్తమ సేవలు అందించిన బీఎల్ఓలకు సన్మానం



కంకిపాడులో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ అనూష

పెనమలూరు: ఓటు హక్కు వినియోగం ద్వారా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవచ్చని ఆర్డీఓ డి.రాజు తెలిపారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీఓ రాజు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు కల్పించిందన్నారు. ఓటు ఉన్న వారు ఎన్నికల్లో తమ ఓటు వినియోగించుకొని సరైన నాయకుడిని ఎన్నుకోవాలని సూచించారు. ముఖ్యంగా యువ ఓటర్ల పాత్ర చాలా కీలకమని తెలిపారు. ఈ సందర్భంగా ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రధాన ఎన్నికల కమిషనర్ సందేశాన్ని ప్రదర్శించారు.

జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటర్లను ఆర్డీఓ ఘనంగా సన్మానించారు. 30 మంది వృద్ధ ఓటర్లు, పలువురు ట్రాన్స్‌జెండర్లను సన్మానించారు. కొత్తగా ఓటు వచ్చిన వారికి ఓటరు కార్డు పంపిణీ చేశారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో కీలక పాత్ర పోషించిన 50 మంది బూత్ లెవల్ అధికారులకు సర్టిఫికెట్లు అందజేసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు తహసీల్దార్లు కట్టా వెంకట శివయ్య, ప్రసాద్, మస్తాన్, ఎంపీడీఓ సునీతాశర్మ, సిద్ధార్థ కాలేజీ డీన్ బావినేని పాండురంగారావు, ఎంఈఓ కనకమహాలక్ష్మి, డీటీ భవాని, హెచ్ఎం వై.దుర్గాభవాని, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేశారు. ఓటు హక్కు వినియోగించుకునే వారి సంఖ్యను పెంచే బాధ్యత విద్యార్థులు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రతి ఒక్కరూ ఓటు వేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు.



పెనమలూరులో సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న అధికారులు

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

కంకిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ పి.అనూష ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. ఓటు హక్కును సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ ఉదయ్‌భాస్కర్, ఈఓఆర్డీ మైథిలీ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓటు ప్రాముఖ్యతపై అవగాహన

ఉంగుటూరు: ఓటు ప్రాముఖ్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ డి.వనజాక్షి అన్నారు. మండలంలో పలు గ్రామాల్లో జాతీయ ఓటర్ల దినోత్సవం గురువారం నిర్వహించారు. ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన ఓటరు దినోత్సవంలో తహసీల్దార్ పాల్గొని ఓటు ప్రాముఖ్యతను వివరించారు. ఓటు వజ్రాయుధంలాంటిదని ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం సీనియర్ సిటిజన్లు ఇద్దరిని సన్మానించారు. ఓటర్ల అవగాహన సదస్సు నందు నిర్వహించిన డిబేట్, వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఇందుపల్లిలో ఎంపీడీఓ శేషగిరి రావు, ఈఓపీఆర్డీ అమీర్ బాషా ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని సీనియర్ సిటిజన్లను ఘనంగా సత్కరించారు. హెచ్ఎం అనిత ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ-2 సాంబశివరావు, సీఆర్పీలు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు విలువైనది



గన్నవరంలో సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న అధికారులు

గన్నవరం: ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి బి.చంద్రలీల పిలుపునిచ్చారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం సహాయ ఎన్నికల నమోదు అధికారి, తహసీల్దార్ సీహెచ్.నరసింహారావు ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ముగ్గుల పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలైన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించడంతో పాటు సీనియర్ ఓటర్లను ఘనంగా సత్కరించారు. ఎన్నికల విభాగం డెప్యూటీ తహసీల్దార్ గోపాలరెడ్డి, ఎంఈఓ-2 కమల, పాఠశాల హెచ్ఎం ఎస్.రవీంద్రభవాని తదితరులు పాల్గొన్నారు. పలు గ్రామాల్లో బీఎల్వోలు ఆధ్వర్యంలో సీనియర్ ఓటర్లను సత్కరించారు.

IN THE COURT OF HON'BLE SENIOR CIVIL JUDGE COURT, KANDUKUR
O.S.NO.26/2020

Between:-
Vardhineni Seshamma ...Plaintiff
and
1 .Thotakura Padma
2. Thotakura Purna Chandra Rao
3. Thotakura Naren Chandra
4. Thotakura Vasumathi
... Defendants

To,
1. Thotakura Padma,
W/o. Kishore Kumar (late)
2. Thotakura Purna Chandra Rao
S/o. Kishore Kumar (late) Both are residence of Veterinary Hospital Road, Poranki Village, Penamaluru Mandal, Vijayawada, N.T.R. District

NOTICE

My client one Smt. Vardhineni Seshamma wife of Kistaiah (late) of Singarayakonda Village and Mandal, Prakasam District has filed the above said case against you i.e., 1 to 4 for recovery of pronote amount and interest thereon which was executed by late Kishore Kumar son of Purna Chandra Rao of Vijayawada. The above said case is posted on 07.02. 2024 for your notice and appearance. So you 1 and 2 has to appear before Senior Civil Judge Court, Kandukur on 07.02.2024 at about 10:30 A.M either in person or through your counsel without fail. Otherwise the matter will be decide against you. Hence this notice.
Date: 25.01.2024
Place: Kandukur

K.Mallikarjuna Rao, Advocate,
Opp. Police Station,
Kandukur - 523105,
SPSR Nellore District, A.P.
Cell: 98481 50966